క్లుప్తంగా

కిర్లంపూడిలో పోలీస్ పికెట్



కిర్లంపూడిలో పోలీస్ పికెట్ నిర్వహిస్తున్న సీఐ లక్ష్మణరావు, ఎస్సై జబీర్

కిర్లంపూడి: కిర్లంపూడిలో జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు ఆధ్వర్యంలో బుధవారం పోలీస్ పికెట్ కొనసాగింది. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కొనసాగుతోందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామాల్లో అల్లర్లకు తావు లేకుండా స్థానిక ఎస్సై షేక్ జబీర్‌తో కలిసి పికెట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక






ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులు

శంఖవరం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) 2024 పరీక్షా ఫలితాల్లో స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రిన్సిపాల్ కె.కృష్ణవేణి బుధవారం తెలిపారు. తమ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు ఎస్.స్వాతి, వై.అపర్ణాదేవి, ఎస్.దేవి, ఇ.దేవకి ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి స్కాలర్‌షిప్‌కు ఎంపికై నట్టు చెప్పారు. వీరికి నాలుగేళ్ల పాటు రూ.12 వేలు చొప్పున ఉపకార వేతనం అందుతుందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంఈఓ ఎస్వీ రమణ, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు అభినందించారు.

దుర్గాడ శివాలయంలో ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో స్వామివారు

గొల్లప్రోలు: మాస శివరాత్రిని పురస్కరించుకుని బుధవారం దుర్గాడ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు ఉదయం స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

డెంగీ, మలేరియాపై అప్రమత్తత అవసరం

గొల్లప్రోలు: మలేరియా, డెంగీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని చేబ్రోలు పీహెచ్‌సీ డాక్టర్ తులసి అన్నారు.బుధవారం మండలంలోని చెందుర్తి గ్రామంలో హెల్త్ వెల్నెస్ సెంటర్‌లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా, డెంగీ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఏఎన్ఎం, ఆశా వర్కర్లకు సూచించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటి వద్ద మంచాన ఉన్న రోగుల వద్దకు వెళ్లి, వైద్య సేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలందించి, పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. తాటిపర్తి గ్రామంలో గొల్లప్రోలు పీహెచ్‌సీ వీహెచ్ఎస్ అహ్మద్ బాషా బుధవారం తాటిపర్తి-1, హెల్త్ వెల్నెస్ సెంటర్‌లో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగీ వ్యాధులపై అప్రమత్తత చాలా అవసరమని చెప్పారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం శుభ్రత దినం పాటించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

యథేచ్ఛగా వృక్ష సంపద నరికివేత

కొత్తపల్లి: అటవీ, విద్యుత్ అధికారుల సమన్వయం లోపం కారణంగా విలువైన వృక్ష సంపద నేలకొరుగుతోంది. కష్టపడి పెంచిన మొక్కలకు అటవీ శాఖ అధికారుల సంరక్షణ లేకపోవడం ఒక తీరైతే, సాంకేతిక ఇబ్బందులంటూ పచ్చని చెట్లను తొలగించడమే పనిగా పెట్టుకున్న విద్యుత్ అధికారులది మరో తీరు. మండలంలో ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో మొక్కలు ఏపుగా పెరిగి రహదారికి ఇరువైపులా సుందరంగా, ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. వి ద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయన్న నెపంతో సంబంధిత అధికారులు చెట్ల కొమ్మలను యథేచ్ఛగా నరికివేస్తున్నారు. మొక్కలు నాటినప్పుడు నోరు మెదపని విద్యుత్ అధికారులు నేడు విద్యు త్ లైన్ల కోసం చెట్లను తెగనరుకుతున్నారు. పాలకులు వ్యయప్రయాసలతో ఏటా లక్షలాది మొక్కలు నాటుతుంటే, ఆ లక్ష్యాన్ని విస్మరించి ఇష్టం వచ్చినట్టు నరకడం బాధాకరమని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చదువుకు వేళాయె..

- 12న తెరుచుకోనున్న పాఠశాలలు
- విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పుస్తకాలు సిద్ధం
- రేపటితో ముగుస్తున్న కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత అడ్మిషన్లు

తుని రూరల్: విద్యార్థులకు వేసవి సెలవులు మరో వారం రోజుల్లో ముగియనున్నాయి. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభం కానుండడంతో విద్యార్థులు ఆటవిడుపులకు సెలవిచ్చి చదువులకు సిద్ధమవుతున్నారు. వేసవి సెలవల అనంతరం ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విద్యా కానుక కిట్లు మండల కేంద్రాలకు చేరాయి.

పుస్తకాలు రెడీ

ప్రధానంగా రాత పుస్తకాలు, 8, 9, 10 తరగతుల పాఠ్య పుస్తకాలు, షూలు వందశాతం, ఒకటి నుంచి ఏడు తరగతులకు చెందిన పాఠ్య పుస్తకాలు 25 శాతం అందుబాటులో ఉన్నాయి. పాఠశాలలు తెరిచే నాటికి పూర్తిస్థాయిలో విద్యా కానుకలు, పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు మండలాలకు చేరనున్నాయి. పాఠశాలలు తెరిచిన రోజు నుంచి ఒకటి, ఆరు తరగతుల్లో విద్యార్థుల చేరికలు ప్రారంభమవుతాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో 131 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, 15 ప్రాథమికోన్నత పాఠశాలలు, 41 జిల్లా పరిషత్, కేజీబీవీ, ప్రభుత్వ, మున్సిపల్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకూ 19,104 మంది విద్యార్థులు చదువుతున్నారు.

నాడు-నేడులో అభివృద్ధి

తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలను రెండో విడత మనబడి నాడు-నేడు పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారు. పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, మౌలిక వసతులు కల్పన పనులు చేపట్టారు. ఇందుకు రూ.45 కోట్లు ఖర్చు చేశారు. రెండో విడత పనులు సైతం పూర్తికావస్తున్నాయి. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారు. 800 మంది విద్యార్థులకు కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత విద్య అందించేందుకు ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. మొదట విడత పూర్తవగా ఈ నెల ఏడో తేదీ వరకూ రెండో విడత చేరికలు జరుగనున్నాయి.



నాడు-నేడులో అభివృద్ధి చేసిన తుని బ్యాంకు కాలనీలో మున్సిపల్ హైస్కూల్

నియోజకవర్గంలో విద్యార్థులు, పాఠశాలల వివరాలు

మండలం	విద్యార్థుల సంఖ్య	ఎంపీపీ స్కూళ్లు	యూపీ స్కూళ్లు	హైస్కూళ్లు
తుని	9907	62	08	21
తొండంగి	6377	44	07	13
కోటనందూరు	2827	25	00	07
మొత్తం	19,111	131	15	41



మండలానికి చేరిన విద్యా కానుక కిట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ గీతాదేవి



మండలానికి చేరిన పాఠ్య పుస్తకాలను సరిచూస్తున్న ఎంఈఓ-2 రామకృష్ణ

12 నుంచి అడ్మిషన్లు



విద్యా సంవత్సరం ప్రారంభం నాటి నుంచి అడ్మిషన్లు తీసుకుంటాం. ఆయా పాఠశాలల్లో హెచ్ఎంలో విద్యార్థులను జాయిన్ చేసుకుంటారు. కార్పొరేట్ విద్యాలయాల్లో ఉచిత విద్యకు తుని మండలంలో రెండు విడతల్లో 338 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఎంపికైన విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వడంలో ఆయా పాఠశాలలు వివిధ పత్రాలు పేరుతో జాప్యం చేస్తే నిబంధనలు మేరకు చర్యలు తీసుకుంటాం. కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత విద్య ఒకటో తరగతిలో ప్రవేశానికి ఎంపికైన విద్యార్థులు పట్టణాల్లో రూ.8 వేలు, గ్రామాల్లో రూ.6 వేలు చొప్పున ఆయా పాఠశాలలకు చెల్లించాల్సి ఉంది. వీరికి అమ్మఒడి పథకం వర్తిస్తుంది.

– పరవాడ గీతాదేవి, ఎంఈఓ, తుని

13 మంది అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతు

ప్రత్తిపాడు: సార్వత్రిక ఎన్నికల్లో ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన 15 మంది అభ్యర్థుల్లో 13 మంది డిపాజిట్లను కోల్పోయారు. నియోజకవర్గంలో 2,17,267 మంది ఓటర్లకు గాను 1,74,893 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. డిపాజిట్ పొందాలంటే పోలైన ఓట్లలో ఆరు శాతం ఓట్లు రావలసి ఉంది. మొత్తం 13 మంది అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోగా మూడో స్థానంలో 2,577 ఓట్లతో నోటా నిలిచింది. టీడీపీ అభ్యర్థి వరుపుల సత్యప్రభకు 1, 01,856, వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరుపుల సుబ్బారావుకు 63,810 ఓట్లు లభించాయి. మిగిలిన అభ్యర్థులకు 1,350 స్కోరు దాటనేలేదు. నీరుకొండ వీరవెంకట సత్యనారాయణ (కాంగ్రెస్)కు 1,345 ఓట్లు, భూర్తి శ్రీనుబాబు (బీఎస్పీ)కు 755 ఓట్లు, ఏగుపాటి అర్జునరావు (సీపీఐ(ఎంఎల్) లిబరేషన్)కు 579, ఆసిన శ్రీనువాసు (పిరమిడ్ ఆఫ్ ఇండియా)కు 281 ఓట్లు, ఏడిద వరప్రసాద్ కుమార్ (ఆర్‌పీఐ-ఎ)కు 166 ఓట్లు, నేతల కొండబాబు (బీఎస్పీ)కు 316 ఓట్లు, గొంప శివ (బీసీవైపి)కి 688 ఓట్లు, దాడిశెట్టి వీరబాబు (జైభీంరావ్ భారత్ పార్టీ)కు 245 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థులు కొత్తపల్లి అర్జునరావుకు 257 ఓట్లు, గొంతిన శివరాజాకు 872 ఓట్లు, నమ్మి గణేష్‌కు 408 ఓట్లు, పిల్లి బలరాముడుకు 335 ఓట్లు, సుర్ల శ్రీనివాసుకు 403 ఓట్లు లభించాయి. ప్రతి రౌండులోనూ మూడోస్థానం నోటాకే రావడం విశేషం.

ఘనంగా నేరేళ్లమ్మ తల్లి జాతర

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరి గ్రామ దేవత నేరేళ్లమ్మ తల్లి జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో చిరుతాడిని గరగ నృత్యాలతో ఊరేగించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. గత 15 రోజులుగా గ్రామంలో ప్రతి రోజూ గరగ నృత్యాలు నిర్వహిస్తున్నారు. గురువారం అమ్మవారి తీర్థాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

వర్షంతో ఉపశమనం



తుని జీఎన్‌టీ రోడ్డులో కురుస్తున్న వర్షం

తుని: ఎండలతో అల్లాడుతున్న ప్రజలు రుతుపవనాల ప్రభావంతో కురిసిన వర్షానికి సేదతీరారు. బుధవారం సాయంత్రం పట్టణంలో కుండపోత వర్షం కురిసింది. వేడి గాలులతో ఇబ్బంది పడుతున్న జనం చల్లటి వాతావరణాన్ని ఆశ్వాదించారు. పట్టణ పరిధిలోని రోడ్లు నీటితో నిండాయి. కాలువల్లో నీటి ప్రవాహం పరుగుల తీసింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో పెద్దల నుంచి పిల్లల వరకు ఆనందం వ్యక్తం చేశారు. ఆకాల వర్షంతో కొంత మేర మామిడి, ఉద్యాన పంటలకు మేలు జరుగుతుందని వ్యవసాయాధికారులు తెలిపారు.

జోరు వాన

ఏలేశ్వరం: మండల వ్యాప్తంగా బుధవారం ఈదురు గాలులతో అకాల వర్షం కురిసింది. ఉష్ణతాపంలో అల్లాడుతున్న ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉండడంతో వృద్ధులు, పిల్లలు అవస్థలు పడ్డారు. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై గాలులతో కూడిన వర్షం పడింది. వాతావరణం చల్లబడటంతో ప్రజలు సేదతీరారు. గత వారం రోజులుగా అడపాదడపా వర్షాలు పడటంతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం రైతులు తమ పొలాల్లో పశువుల కోసం పచ్చిరొట్ట సాగు చేస్తున్నారు.



ఏలేశ్వరంలో కురుస్తున్న వర్షం

చల్లబడిన వాతావరణం

ప్రత్తిపాడు: మండల వ్యాప్తంగా బుధవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఎండలతో అల్లాడిన ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు. ఉదయం నుంచి ఎండ, ఉక్కబోత ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండలంలో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆరుతడి పంటలు, కూరగాయల పంటలకు ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రౌతులపూడి: మండలంలో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ ఎక్కువగా ఉండటంతో చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఎండలకు అల్లాడిన ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు.

ఉదయం వేడిగా...సాయంత్రం చల్లగా...

గోకవరం: మెట్ట ప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గంలో బుధవారం వాతావరణం రెండు రకాలుగా మారింది. ఉదయం భానుడు తన ప్రతాపం చూపడంతో ప్రజలు ఎండ వేడిమికి అల్లాడిపోయారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మేఘావృతం కావడంతో పాటు చల్లని గాలులు వీయడంతో ఆహ్లాదకరంగా మారింది. ఉదయం వేసవితాపాన్ని ఎదుర్కొన్న ప్రజలు సాయంత్రం చల్లగాలులకు సేదతీరారు.

కూల్‌గా మారిన వాతావరణం

గండేపల్లి: కొద్దిరోజులుగా ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలు బుధవారం సాయంత్రం కురిసిన చిరుజల్లులతో సేదతీరారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకూ ఎండ ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడ్డాయి. వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

మేలైన పంటకు మట్టి పరీక్ష

- భూసార పరీక్షలతో సాగుకు ప్రయోజనాలు
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు
- రసాయన ఎరువుల వినియోగానికి దూరం

పెద్దాపురం: పూర్వం వేసవిలో భూమిని దుక్కి చేసేవారు. పెంటగెత్తం, చెరువు మట్టిని వేసి సారవంతం చేసేవారు. వర్షాలు అనుకూలించిన వెంటనే సాగుకు సిద్ధమయ్యేవారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వచ్చేవి. ఆరోగ్యకరమైన పంటలు చేతికి అందేవి. కాలం మారింది. రసాయన ఎరువుల వినియోగం పెరిగింది. భూమి నిస్సారమై, పంటలు కలిసి రావడం లేదు. ఏ పంట సాగు చేసినా పెట్టుబడే మిగులుతోంది. ఈ నేపథ్యంలో భూసార పరీక్షలకు ప్రాధాన్యం పెరిగింది. మట్టి పరీక్షలు నిర్వహించి పోషక లోపాలు నివారించాలని, పశువుల పెంట, పచ్చిరొట్ట ఎరువులతో భూమిని సారవంతం చేయాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. మట్టి పరీక్షల ప్రాధాన్యం వివరిస్తున్నారు. భూసార పరీక్షల నివేదిక ఆధారంగా పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని సామర్లకోట మండలంలో 22,250 ఎకరాలు, పెద్దాపురం మండలంలో 9,892 ఎకరాలు, వెరసి 32,142 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ఎరువులు ఎక్కువ మోతాదులో పొలాల్లో వినియోగించడంతో భూమిలో పోషక విలువలు తగ్గి, భూమి నిస్సారంగా మారింది. కాంప్లెక్స్ ఎరువుల వినియోగంతో భూమిలో సూక్ష్మ, స్థూల పోషకాల్లో వ్యత్యాసాలు ఏర్పడి, దిగుబడులు తగ్గడంతో పాటు చీడపీడలు అధికమతున్నాయి. నియోజకవర్గంలో ఎక్కువ శాతం జింకు లోపంతో ఉన్న నేలలే అధికంగా ఉన్నట్టు వ్యవసాయ గణాంకాలు చెబుతున్నాయి.

భూసార పరీక్షలు ఇలా..

సాధారణ పొలంలో అయితే ఆరు అంగుళాల లోతు, చెరకు, అరటి లాంటి పొలాల్లో అయితే ఎనిమిది అంగుళాల లోతులో వి ఆకారంలో పారతో కట్ చేసి, మట్టి నమూనా సేకరించాలి. ఇలా ప్రతి ఐదెకరాలకు ఒక మట్టి నమూనాను సేకరిస్తారు. మట్టి నమూనాతో పాటు, రైతు పేరు, సర్వే నంబరు, విస్తీర్ణం, ముందు వేసిన పంట, వేయబోయే పంట, వినియోగించిన ఎరువుల వివరాలను పొందుపరుస్తారు. వీటిని ఇంటిగ్రేటెడ్ ల్యాబ్(భూసార పరీక్షా కేంద్రం)కు తరలించి, పరీక్షలు నిర్వహిస్తారు. భూసార పరీక్ష అనంతరం సేంద్రియ కర్బనం, ఎలక్ట్రికల్ కండక్టవిటీ (ఈసీ), ఉదజని సూచిక (పీహెచ్), నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మ మూలకాలు తదితర ధాతు లోపాలు కార్డుపై నమోదు చేసి రైతుకి అందిస్తారు. దీంతో లోపాలు సవరించేందుకు కార్డులో ఇచ్చిన ధాతువులు పొలంలో వేసుకుంటే భూమిలో సిరులు పండుతాయి. ఈ పరీక్షలు ఖరీఫ్ సాగు ప్రారంభం నాటికి పూర్తి చేస్తామని వ్యవసాయ శాఖ సిబ్బంది చెబుతున్నారు.



పెద్దాపురంలో మట్టి నమూనా సేకరిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

భూసార పరీక్షల వల్ల లాభాలు..

- ఎరువుల వినియోగం తగ్గడం ద్వారా ఖర్చు తగ్గించుకోవచ్చు.
- భూమిలో ఎటువంటి లోపాలున్నాయో తెలుస్తాయి.
- తెగుళ్లు, పురుగులను నివారించవచ్చు.
- వ్యవసాయ పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం
- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు

ప్రత్తిపాడు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు సూపరింటిండెంట్ కాంతారావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కోర్టు సూపరింటిండెంట్ కాంతారావు ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ హితం అందరి అభిమతం కావాలని పిలుపునిచ్చారు. కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటి, పచ్చదనాన్ని పెంచాలని కోరారు. కార్యక్రమంలో ప్యానెల్ అడ్వకేట్ బొంగుకూరి మధుబాబు, లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

తుని రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. వి.కొత్తూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పద్మజ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. గ్రామస్తులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. తాళ్లూరులో ఉర్దూ పాఠశాల హెచ్ఎం జోషిపాల్, కో ఆర్డినేటర్ చందక కిరణ్‌కుమారి ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తేనే మానవ మనుగడ సాధ్యమని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మల్లిసాలలో మొక్కలు నాటుతున్న సీడీపీఓ పూర్ణిమ, విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ

ఏలేశ్వరం: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా పట్టణంలో బుధవారం విద్యార్థులు పర్యవరణ పరిరక్షణ కోరుతూ ర్యాలీ చేశారు. లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి పలు ప్రాంతాల మీదుగా ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా లైబ్రేరియన్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విద్యార్థి దశ నుంచి మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. మొక్కల పెంపకం ద్వారానే పర్యవరణ పరిరక్షణ సాధ్యమన్నారు. వాతావరణ సమతుల్యతలో మొక్కలు ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెన్నా శ్రీను, మువ్వల లోవప్రసాద్, పీఈటీ చారి, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

జగ్గంపేట: పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా గుర్తించి, మొక్కలు నాటాలని జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ అన్నారు. మండలంలోని రాజపూడి, మల్లిసాల గ్రామాల్లో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. అంగన్‌వాడీ సెంటర్లలో విద్యార్థులతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలుష్య కారకాలు, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పర్యవరణాన్ని పరిరక్షించకుంటే భవిష్యత్ తరాలు అత్యధిక ఉష్ణోగ్రతలతో పాటు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. పిల్లలకు మొక్కలు పెంచడం చేయాలని సూచించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



వి.కొత్తూరులో ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



ప్రత్తిపాడు కోర్టు ప్రాంగణంలో మొక్క నాటుతున్న సూపరింటెండెంట్ కాంతారావు

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



బొద్దవరం గ్రామ సచివాలయం వద్ద మొక్క నాటుతున్న అరుణ్‌కుమార్

కోటనందూరు: మొక్కల పెంపకాన్ని అందరూ బాధ్యతగా తీసుకోవాలని పంచాయతీ విస్తరణాధికారి జి. అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని బొద్దవరం గ్రామ సచివాలయం, టీజే నగరంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద బుధవారం ఆయన సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ వాతావరణ కాలుష్యంతో ఉష్ణోగ్రతలు పెరిగిపోయి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారన్నారు. ఏటా పెచ్చుమీరుతున్న ఉష్ణతాపంతో మనుషులతో పాటు మూగజీవాలు చనిపోతున్న పరిస్థితులు చూస్తున్నామన్నారు. ఈ దుస్థితిని అధిగమించాలంటే పర్యావరణ సమతుల్యత సాధించడం కీలకమన్నారు. పాఠశాలల యాజమాన్యం, స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రజాసంఘాలు, ప్రభుత్వ సిబ్బంది మొక్కలు నాటి వాటి సంరక్షణను బాధతగా తీసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు భవాని, రామచంద్రకుమార్ పాల్గొన్నారు.